


కాగజ్‌నగర్ పట్టణంలోని పేపర్ మిల్లు

# ఎన్నాళ్లీ నిరీక్షణ!

**ఎస్పీఎంలో కానరాని గుర్తింపు సంఘం ఎన్నికలు**

- ఆరేళ్లుగా ఎదురుచూస్తున్న కార్మికులు
- యాజమాన్యమే అడ్డుకుంటున్నదన్న ఆరోపణలు
- రహస్యంగా కార్మికుల వేతన ఒప్పందం?

కాగజ్‌నగర్, డిసెబర్ 29 : సిర్పూర్ పేపర్ మిల్లులో గుర్తింపు సంఘం ఎన్నికల కోసం నిరీక్షణ తప్పడం లేదు. పాత యాజమాన్యం నిర్లక్ష్యంతో 2014 సెప్టెంబర్‌లో మిల్లు మూతపడగా, అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ చొరవతో 2018 ఆగస్టులో పున:ప్రారంభమైంది. మిల్లు తెరచుకొని ఆరేళ్లు కావస్తున్నా గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించకపోవడంతో కార్మికులు నిరాశచెందుతున్నారు. ఎన్నికలు పూర్తయితే క్యాంటీన్ సౌకర్యం, కొత్తగా యువతకు ఉద్యోగావకాశాలు, మృతుల కుటుంబాలకు రావాల్సిన బెనిఫిట్స్‌తో పాటు తదితర సౌకర్యాలు అందుతాయని కార్మికులు భావిస్తున్నారు.

### లేబర్ కమిషన్ దృష్టికి తీసుకెళ్లిన ఆర్‌ఎస్పీ

ఎన్నికల విషయాన్ని ఇటీవల బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ హైదరాబాద్ లేబర్ కమిషనర్ కృష్ణాదిత్య దృష్టికి తీసుకెళ్లారు. అందుకు ఆయన స్పందించి డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ ఆదిలాబాద్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు 14 సంఘాలకు సంబంధించిన ఆన్యూవల్ రిటర్న్స్ సబ్‌మిట్ చేయాలని డిప్యూటీ కమిషనర్ నుంచి పిలుపువచ్చింది. అయితే.. గుర్తింపు కార్మిక సంఘం నాయకులు పత్రాలు అందించి మూడు నెలలు గడుస్తున్నా ఎన్నికల ప్రక్రియ ప్రారంభించకపోవడంతో కార్మికులు ఆందోళనలో ఉన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధకారులు స్పందించి ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘం, కార్మికులు కోరుతున్నారు. కాగా, మిల్లు యాజమాన్యమే ఎన్నికలు జరగకుండా అడ్డుకుంటున్నదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

### రహస్య ఒప్పందం?

పేపర్ మిల్లులో కార్మికుల వేతన ఒప్పందాన్ని రహస్యంగా నిర్వహించుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పాత యాజమాన్యం రెండేళ్ల వేతన ఒప్పందం చేసుకుంటే.. ప్రస్తుత యాజమాన్యం రెండు దఫాలు నాలుగేళ్ల కార్మిక వేతన ఒప్పందం చేసుకున్నదని తెలుస్తున్నది. మిల్లులో ఎలాంటి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు జరుగక పోవడంతో యాజమాన్యం అనుకూల కార్మికులతో అడహక్ కమిటీ ఏర్పాటు చేసి.. వరంగల్ జాయింట్ లేబర్ కార్యాలయంలో రహస్యంగా అగ్రిమెంట్ చేసుకున్నారని కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. వేతన ఒప్పంద పత్రాలు సైతం బహిరంగం చేయడం లేదని, కార్మికులకు రావాల్సిన బెనిఫిట్స్ అందడం లేదని వారు పేర్కొంటున్నారు. గతంలో కార్మికులకు ఏడాదిలో 30 రోజులు సెలవులు ఇస్తే.. ప్రస్తుతం ఏడాదిలో కేవలం 26 రోజులే ఇస్తున్నారని, ఇక్కడ మిల్లులో కార్మిక చట్టాలు అమలు కావడం లేదని, గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగితేనే తమకు న్యాయం జరుగుతుందని కార్మికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలి

**కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం**



చింతలమానేపల్లిలో పోలీస్‌స్టేషన్ రికార్డులను పరిశీలిస్తున్న కాగజ్‌నగర్ డీఎస్పీ రమానుజం

చింతలమానేపల్లి, డిసెంబర్ 29 : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం ఆదివారం తనిఖీ చేశా రు. రికార్డులతో పాటు పలు గదులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడి విధులకు సంబంధించిన సూచనలు చేశా రు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎల్లవేళలా ఫిర్యాదులు స్వీకరించాలని, సత్వరమే స్పందించాలని సిబ్బందికి సూచించారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని, కొత్త సంవత్సరం వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట సీఐ రమేశ్, ఎస్ఐ నరేశ్ ఉన్నారు.

**రెవెన్యూ 'చేతి'వాటం**

# కౌలుదారే కాజేసే కుట్ర!

**పదేళ్ల క్రితం చనిపోయిన బచ్చలకూర లచ్చయ్య భూమిని స్వాహా చేసేందుకు యత్నించిన కాంగ్రెస్ లీడర్**

*ఓ వ్యక్తి పదేళ్లక్రితం చనిపోగా.. అదే పేరున్న ఇంకొకరితో ఈ కైవేసీ పూర్తి చేసి.. భూమిని కాజేసే కుట్రకు దిగాడు స్థానిక కాంగ్రెస్ లీడర్ (కౌలుదారు). మరో నాయకుడి అండదండలు.. రెవెన్యూ అధికారుల సహకారంతో పట్టా పాస్ బుక్ పొందాడు. దానిని తమ వాళ్ల పేరిట పట్టా చేసుకునేందుకు స్లాట్ బుక్ చేసుకోగా, అదే రోజు మాజీ ప్రధాని మృతికి సెలవు ప్రకటించడం.. అంతలోనే మృతుడి కుమారుల ఫిర్యాదుతో అసలు బాగోతం బయటపడింది.*

- అదే పేరున్న వ్యక్తిని తీసుకొచ్చి ఈ కేవైసీ పూర్తి
- ఆ వెంటనే తమవారి పేర్లమీదకు మార్చేందుకు స్లాట్‌బుక్
- అదే రోజున మాజీ ప్రధాని మృతికి సెలవు ప్రకటించడంతో బయటపడ్డ బాగోతం

చెన్నూర్ రూరల్, డిసెంబర్ 29 : చెన్నూర్ మండలం రచ్చపల్లి గ్రామానికి చెందిన బచ్చలకూర లచ్చయ్య (తండ్రి పేరు లస్మయ్య) కొన్నేళ్ల క్రితం బతుకుదెరువు కోసం తన కుటుంబ సభ్యులతో కలిసి మహారాష్ట్రలోని సిరొంచ తాలుకాలోని రాయిపేటకు వెళ్లాడు. లచ్చయ్య పేరు మీద రచ్చపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పొక్కూరు శివారులో సర్వే నంబర్ 876లో ఎకరం 35 గుంటల భూమి ఉన్నది. ఆ భూమిని లచ్చయ్య కుమారులు దగ్గరి బంధువు(కాంగ్రెస్ లీడర్)కు కౌలుకిచ్చారు. యేటా కౌలు తీసుకుంటున్నారు. సుమారు పదేళ్ల క్రితం లచ్చయ్య మృతి చెందాడు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ధరణి పోర్టల్ వచ్చింది. అప్పటికే లచ్చయ్య మృతి చెందడంతో ఈ కేవైసీ ప్రక్రియ పూర్తి కాలేదు. ఆ భూమి లచ్చయ్య కొడుకుల పేరు మీదికి మారలేదు. దీనిని ఆసరాగా చేసుకొని కౌలు చేసుకుంటున్న సదరు లీడర్.. ఆ భూమిని స్వాహా చేసేందుకు మరో నాయకుడితో కలిసి పథకం పన్నాడు. మహారాష్ట్రలోని సిరొంచ తాలుకాలోని రాయిపేటలో తన బంధువు కూడా బచ్చలకూర లచ్చయ్య పేరుతో ఉన్నాడని గుర్తించారు. లచ్చయ్య తండ్రి పేరు ఆధార్‌లో వేరే ఉండడంతో.. తండ్రి లస్మయ్య పేరు ఉన్నట్లుగా నకిలీ ఆధార్ కార్డు తయారు చేశారు. చెన్నూర్ మీసేవలో పాస్ బుక్కు పొందడానికి ఈ కేవైసీకి దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు వెంటనే పాస్‌బుక్ మంజూరు చేశారు.

### రెవెన్యూ అధికారుల చేతివాటం

ధరణి వచ్చి దాదాపు పదేళ్లవుతుంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు బచ్చలకూర లచ్చయ్య ఈ కేవైసీ నమోదు లేదు. దీంతో రాయిపేటకు చెందిన లచ్చయ్య (నకిలీ) ద్వారా దరఖాస్తు చేసుకోగానే ఆర్ఐతో పాటు సిబ్బంది గ్రామానికి వెళ్లి మోఖ పంచనామా నిర్వహించారు. నిబంధనల ప్రకారం మోఖ పంచనామా రికార్డు కోసం రచ్చపల్లి గ్రామానికి వెళ్లాలి. రచ్చపల్లికి చెందిన రైతుల సాక్ష్యాలు (పంచులు) తీసుకోవాలి. వారి వాంగ్మూలం రికార్డు చేయాలి. ఈ నిబంధనలేవీ పాటించకుండా ముత్తరావుపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి వాంగ్మూలం రికార్డు చేశారు. వివరాలు అన్ని సక్రమంగా ఉన్నాయంటూ నివేదికను తహసీల్దార్‌కు అందజేశారు. నెల రోజులు కావాల్సిన ఈకేవైసీ వారంలో పూర్తయ్యింది. దీనికి ఇద్దరు రెవెన్యూ అధికారులు. ఒక దస్తావేజులేకరి, ఓ ప్రజాప్రతినిధి హస్తం ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

### వెంటనే వేరే వాళ్ల పేర్ల మీదికి పట్టా మార్పిడి

వేరే వ్యక్తిని చూపి ఈ కేవైసీ పూర్తి చేసి పట్టా పాస్ బుక్కు పొందిన నాలుగు రోజులకే లచ్చయ్య పేరు మీద ఉన్న భూమిని వారి బంధువులు అయిన ఇద్దరి మహిళల పేర్ల మీద రిజిస్ట్రేషన్ చేయాలనుకున్నారు. ఇందుకోసం ఈ నెల 27న స్లాట్ బుక్ చేసుకున్నారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి చెందడం.. ప్రభుత్వం సెలవు ప్రకటించడంతో రిజిస్ట్రేషన్ నిలిచిపోయింది. గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకున్న లచ్చయ్య వారసులు వచ్చి జరిగిన విషయాన్ని తహసీల్దార్‌కు వివరించారు. లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చి రిజిస్ట్రేషన్‌లు నిలిపివేయాలని కోరారు. ఈ విషయమై తహసీల్దార్, ఆర్ఐని ఫోన్‌లో వివరణ కోరేందుకు యత్నించగా వారు అందుబాటులోకి రాలేదు.



రిజిస్ట్రేషన్ నిలిపివేయాలని తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న లచ్చయ్య వారసులు, బంధువులు

# రైతులను ఆదుకోవాలి

## లేదంటే ప్రతి గ్రామం లగచర్లగా మారుతుంది

- సీఆర్టీ, ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి
- అటవీ సమీప గ్రామాల ప్రజలకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

పెంచికల్ పేట్,డిసెంబర్ 29 : అటవీ సమీపగ్రామాల రైతులను రాష్ట్ర ప్రభుత్వమే ఆదుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. లేదంటే ప్రతి గ్రామం లగచర్లగా మారుతుందని హెచ్చరించారు. పెంచికల్‌పేట్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు భరోసా కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రైతుల కోసం పోరాటం చేసే ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని పేర్కొన్నారు. సిర్పూర్ నియోజకవర్గంలో పేదలకు విద్య, వైద్యం అందడం లేదని, రోడ్లు అధ్వానంగా మారాయని, పట్టించుకునే వారే కరువయ్యారన్నారు. పులుల దాడుల్లో గాయపడ్డ వారికి, మరణించిన వారికి ప్రభుత్వం సరైన నష్టపరిహారం అందించడం లేదని మండిపడ్డారు. 15 రోజులుగా ఆశ్రమ పాఠశాలల సీఆర్టీలు, సర్వ శిక్షా అభియాన్ ఉద్యోగులు ధర్నాలు చేస్తున్న సర్కారు స్పందించడం లేదని, ఇలాగైతే చదువులు సాగేదెలా అని, పదో తరగతి విద్యార్థుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. అటవీ ప్రాంత గ్రామాల రైతులకు ముందస్తుగా అన్ని రకాల ఇన్సూరెన్స్‌లను అధికారులే కల్పించాలని కోరారు. సాయంత్రం పనికి వెళ్లి తిరిగి వస్తున్న మహిళలతో ఆప్యాయంగా కొద్దిసేపు మాట్లాడారు. మొర్లీగూడలో యువకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు బండి మహేశ్, గోపాల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

## ఓపెన్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

దండేపల్లి, డిసెంబర్ 29 : ప్రభుత్వ సెలవు దినాల్లో నిర్వహించే ఓపెన్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి జిల్లా సమన్వయకర్త నాగుల అశోక్ అన్నారు. ఆదివారం దండేపల్లి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఓపెన్ తరగతులను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రవేశాలకు ఈ నెల 30 వరకు గడువు ఉందని, ఏప్రిల్‌లో నిర్వహించే పరీక్షలకు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సహ సమన్వయకర్త సంఘర్స్ రాజేశ్వర్‌రావు, చెట్పల్లి రమేశ్, కొండు జనార్దన్, రామన్న, అభ్యాసకులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా సమన్వయకర్త నాగుల అశోక్

## అంగడిలో అడవుల సంరక్షణపై ప్రచారం

కెరమెరి, డిసెంబర్ 29 : కెరమెరిలోని అంగడిలో ఆదివారం ఎఫ్ఆర్వో మజారొద్దీన్ ఆధ్వర్యంలో సిబ్బంది వినూత్న ప్రచారం నిర్వహించారు. అడవుల సంరక్షణపై గోండి భాషలో అవగాహన కల్పించారు. అడవులతోనే మనుగడ సాధ్యమనిన్నారు. రక్షణ పేరిట విద్యుత్ వైర్లు అమర్చడం, వన్యప్రాణులను వేటాడడం వంటివి చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎఫ్బీవోలు రామయ్య, అటవీ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



వార సంతలో ప్రచారం చేస్తున్న ఎఫ్ఆర్వో మజారొద్దీన్



ఆసిఫాబాద్ టౌన్ : ఉద్యోగులకు మద్దతుగా ధర్నాలో పాల్గొన్న జూనియర్ లెక్చరర్ల సంఘం నాయకులు



నస్పూర్ : ఉద్యోగులకు రాఖీలు కడుతున్న మహిళా ఉపాధ్యాయులు

# రేవంతన్నా.. హామీలు నెరవేర్చు

- సమగ్ర శిక్షా ఉద్యోగుల డిమాండ్
- 20వ రోజూ కొనసాగిన సమ్మె

నస్పూర్/ఆసిఫాబాద్ టౌన్, డిసెంబర్ 29 : 'రేవంతన్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చు' అంటూ సమగ్ర శిక్షా ఉద్యోగులు డిమాండ్ చేశారు. నస్పూర్ కలెక్టరేట్ వద్ద చేపట్టిన సమ్మె ఆదివారం 20వ రోజుకు చేరుకున్నది. ఈ సందర్భంగా ఉద్యోగులు రేవంత్‌రెడ్డి మాస్కులు ధరించగా.. మహిళా ఉపాధ్యాయులు వారికి రాఖీలు కట్టి నిరసన తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డిని.. అన్నగా భావించి రాఖీలు కట్టి.. సమస్యలు పరిష్కరించాలని కోరామని వారు తెలిపారు.

### ప్రభుత్వం దిగిరావాలి

ఆసిఫాబాద్ కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్షా ఉద్యోగుల దీక్ష ఆదివారం 20వ రోజుకు చేరుకున్నది. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షురాలు శృతికా మాట్లాడుతూ 20 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రభుత్వం దిగిరావాలని డిమాండ్ చేశారు. జూనియర్ లెక్చరర్ల సంఘం నాయకులు సునీల్, చంద్రయ్య, రాష్ట్ర ఉత్తమ అవార్డు గ్రహీత సుందిళ్ల రమేశ్ మద్దతు తెలిపారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తుకారం, జిల్లా కోశాధికారి నగేశ్, మీడియా ప్రతినిధి గేడేకార్ సంతోశ్, దుర్గం సందీప్, అన్నపూర్ణ చైతన్య , కేజీబీవీ ప్రత్యేకాధికారి కవిత, ఎంఐఎస్ ప్రధాన కార్యదర్శి ప్ర శాంత్, రాజేశ్, రాజకుమార, సీసీవో అధ్యక్షుడు అనూప్, సీఆర్పీ ప్రధాన కార్యదర్శి రాజేశ్, వెంకటేశ్, పీజీ సీఆర్టీలు అన్నపూర్ణ, స్వప్న, పీటీఐ అధ్యక్షుడు సత్యనారాయణ, రమేశ్, ప్రకాశ్, తిరుపతి, దేవేందర్, మహేశ్, శివరాం, ప్రసన్న, స్వప్న, విజయ, బాబు, తిరుపతి, సుభాష్, సతీశ్ పాల్గొన్నారు.

# సమాజహితం కోసం బాధ్యతగా పనిచేయాలి

- ఆసిఫాబాద్ ఎస్పీ శ్రీనివాసరావు
- మంగిలో ఉచిత మెగా వైద్య శిబిరం
- వృద్ధులకు దుప్పట్లు, యువతకు క్రీడా సామగ్రి పంపిణీ

తిర్యాణి,డిసెంబర్ 29 : సమాజ హితం కోసం బాధ్యతాయుతంగా పని చేయడమే పోలీసుల ప్రథమ కర్తవ్యమని కుమ్రంభీం ఆసిఫాబాద్ ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. పోలీసులు మీకోసంలో భాగంగా తిర్యాణి పోలీసుల ఆధ్వర్యంలో మంగీ గ్రామంలో మెడిలైఫ్ హాస్పిటల్ సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించగా, జిల్లా అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావుతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వృద్ధులకు దుప్పట్లు, యువతకు క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఆయా ప్రైవేట్ సంస్థల్లో ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఉన్నత విద్య అభ్యసించలేని నిరుపేద విద్యార్థులకు తమవంతు సాయమందిస్తామని తెలిపారు. దేశ భవిష్యత్ నేటి యువతరం మీదే ఆధారపడి ఉందని, వ్యసనాలకు దూరంగా ఉండి భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. గంజాయి సాగు చేసినా, సేవించినా శిక్ష తప్పదని హెచ్చరించారు. భీంపూర్ నుంచి మంగీ, మంగీ నుంచి గుండాల వరకు, అలాగే కౌఠగాం, కెరగూడ, గోపెర, తైతర గ్రామాల్లో రోడ్లు నిర్మించేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ కరుణాకర్, రెబ్బెన సీఐ బుద్ధే స్వామి, అనిల్ యువసైన్యం ఫౌండేషన్ అధ్యక్షుడు జవ్వాజీ అనిల్‌గౌడ్, తిర్యాణి, రెబ్బెన ఎస్ఐలు వేణుమాధవ్‌గౌడ్, చంద్రశేఖర్, మెడిలైఫ్ హాస్పిటల్ వైద్యులు కుమార స్వామి, శ్రీధర్, వినయ్, శ్రీధర్, ప్రసన్న, శ్రేయ, రఘు, రోజిత, మార్కెటింగ్ మేనేజర్ శంకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

## ఆరిజన్ డెయిరీ సీఈవోపై గుర్తు తెలియని వ్యక్తుల దాడి

బెల్లంపల్లి, డిసెంబర్ 29 : ఆరిజన్ డెయిరీ సీఈవో కందిమల్ల ఆది నారాయణపై ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసిన ఘటన బెల్లంపల్లిలో సంచలనం రేపింది. ఆదినారాయణ, పెరకపల్లి గ్రామానికి చెందిన సుధాకర్ యూనియన్ బ్యాంకు లైన్‌లో సెలూన్‌కు వచ్చారు. బయట నిలబడి ఉండగా ఒక్కసా రిగా గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి వారితో మాట్లాడారు. ఈ క్ర మంలో వాగ్వాదం పెరిగి దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. దీంతో ఆదినారాయణ ఒంటిపై ఉన్న దుస్తులు చిరిగిపోయి గాయాల య్యాయి. స్థానికులు సమాచారం అందించగా పోలీసులు ఆయనను ప్రభుత్వ దవాఖానకు తరలించారు. దాడికి గల కారణాలు తెలియాల్సి ఉంది. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్యను ఫోన్‌లో సంప్రదించగా ఆయన అందుబాటులోనికి రాలేదు.



చికిత్స పొందుతున్న ఆదినారాయణ

# ఉద్యోగుల ఖాళీలను భర్తీ చేయాలి

హాజీపూర్, డిసెంబర్ 29 : నాల్గో తరగతి ఉద్యోగుల ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు గీట్లు సుమిత్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం నాల్గో తరగతి ఉద్యోగుల సంఘ సమావేశం నిర్వహించారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతిపై రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం అధ్యక్షుడు మాట్లాడుతూ ఎజెండాలో పొందుపర్చిన అంశాలపై చర్చించారు. ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన డీఏ, పీఆర్సీపై చర్చించి, ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గోవర్ధన్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఉద్యోగులు

## నిరుపేదలకు సేవ చేసేందుకే క్లబ్ ఏర్పాటు

జైపూర్, డిసెంబర్ 29 : నిరుపేదలకు సేవ చేసేందుకే జైపూర్‌లో లయన్స్‌క్లబ్ ఏర్పాటు చేస్తున్నట్లు లయన్స్‌క్లబ్ రామగుండం అధ్యక్షుడు మల్లిఖార్జున్ తెలపారు. మండలకేంద్రంలో ఆదివారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ క్లబ్ ద్వారా రాజకీయాలకు అతీతంగా సేవచేయడం జరుగుతుందని తెలిపారు. అలాంటివారే సభ్యులుగా చేరాలని తెలిపారు. క్లబ్‌లో చేరాలనుకునేవారు యేటా రూ.10 వేల వరకు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చల్లా సత్యనారాయణరెడ్డి, పీ రాజబాపురెడ్డి, అంబాల రవీందర్‌రెడ్డి, మంథెన లక్ష్మణ్, శీలం వెంకటేశ్, గోనే నర్సయ్య, సంపత్‌రెడ్డి, ముదాం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.